# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 125

VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: మంగళవారం 26 మే 2026








2వ పేజీలో...




2వ పేజీలో...

# బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రతిఇంటికి తాగునీరు అందిస్తాం: కేటీఆర్



**కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ (SIR)పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు.**

**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్‌లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** కేంద్రప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం ఈరోజు (సోమవారం) సచివాలయంలో సమావేశం అయ్యారు. సీఎంని కలిసిన వారిలో సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ , ఈ.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. కార్మికులకు కనీస వేతనాల పెంపుపై ముఖ్యమంత్రికి సీపీఐ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎంతో సీపీఐ నేతలు చర్చించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులతో సీఎం మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లు చేయడం లేదని తెలిపారు. తమ ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.







# సంపాదకీయం

## ఆ జ్ఞాననిధులను విస్మరిస్తే వినాశనమే!

ఉత్తమ భావాలు అన్ని వైపుల నుంచి రావాలి' అని విశ్వసించిన మన పూర్వీకులు అభివృద్ధిపరిచిన జ్ఞాన వ్యవస్థలను గుడ్డిగా ఆరాధించడమో లేదా పూర్తిగా తిరస్కరించడమో జరుగుతోంది. ఇవి ఆలోచనారహిత వైఖరులు. భారతీయ జ్ఞాన వ్యవస్థల పట్ల అటువంటి ప్రతిస్పందనలు వివేకవంతమైనవి కావని ఇటీవలి రెండు నూతన పుస్తకాలు సూచించాయి. పురాతన భారతీయుల శాస్త్రీయ విజ్ఞానాన్ని, తాత్విక భావప్రవంతిని అల్లా టప్పా గా భావించకుండా గంభీరమైన మేధో నిబద్ధతతో మనం వాటిని శోధించి తీరాలని కూడా ఆ పుస్తకాలు నొక్కి చెప్పాయి. ఈ మేధా కర్తవ్యాన్ని ఎలా చేయాలో, ఎలా చేయకూడదో కూడా అవి నిర్దేశించాయి.

భారతీయ ఉన్నత విద్యా జగత్తులో ఇప్పుడు విస్తృతంగా చర్చిస్తున్న విషయం భారతీయ జ్ఞాన వ్యవస్థలు (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్-- ఐకేఎస్). ప్రతి విశ్వవిద్యాలయమూ ఐకేఎస్ సంబంధిత సదస్సును నిర్వహించి దాని వివరాలను సచిత్రంగా, సవివరంగా తమ వెబ్‌సైట్‌పై ఉంచుతున్నది. విద్యావేత్తలూ పురాతన భారతీయ జ్ఞాన సంచయంలో ఒక వినూత్న సత్యాన్ని ఆవిష్కరించేందుకు ఆరాటపడుతున్నారు. తమ పరిశోధనా కృషి, ఐకేఎస్ మధ్య ఉన్న సంబంధాన్ని సగర్వంగా చెప్పుకుంటున్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థలపై ఉన్నత విద్యా ప్రపంచంలో వెల్లివిరుస్తున్న ఈ అభిమానం సహజమైనదేనా? మేధో అంతః ప్రేరణల జనితమేనా? కాదు, కానే కాదు. ప్రభుత్వం పురికొల్పిన విద్యాసక్తి అది. పురాతన భారతీయుల జ్ఞానాన్ని ఆధునిక పాఠ్యాంశాలలో భాగంగా చేసేందుకై భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధన, బోధనను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ప్రభుత్వం పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్న భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధనా కార్యకలాపాల ప్రహసనంపై తీవ్ర విమర్శనాత్మక ప్రతిస్పందనలు అనివార్యంగా వ్యక్తమవుతున్నాయి. దేశ ప్రజల్లో 'వైజ్ఞానిక దృక్పథం'ను పెంపొందించాలని అభిలషిస్తున్నవారు పురాతన భారతీయ జ్ఞానం అశాస్త్రీయమైనదని, అర్థరహితమైనదని కొట్టివేస్తున్నారు. జ్ఞాన సంప్రదాయాలకు ప్రభుత్వం అంత ప్రాధాన్యమివ్వడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకించేవారు బ్రాహ్మణీయ ప్రపంచ దృక్పథాన్ని సమస్త భారతీయులపై రుద్దే ప్రయత్నమే ఐకేఎస్‌ను ప్రోత్సహించడమని నిరసిస్తున్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నవారు నిరంకుశ పాలనా ధోరణులపై నిరసన ప్రబలకుండా అదుపు చేసేందుకే ఐకేఎస్ పేరిట మిథ్యా జాతీయ స్వాభిమానాన్ని పెంపొందిస్తున్నారని దుయ్యబడుతున్నారు. ఐకేఎస్‌కు అనుకూలంగా ప్రభుత్వం ఎంత ఎక్కువగా వాదిస్తే ప్రగతిశీల, ఉదారవాద విద్యావంతులు అంత ఎక్కువగా భారతీయ జ్ఞాన వ్యవస్థ అనే భావనను పరిహసిస్తున్నారు. ప్రభుత్వ వాదన ఎలా ఉన్నప్పటికీ ఐకేఎస్‌ను ఈ విధంగా అపహసించడం, తిరస్కరించడం తీవ్ర మేధాపరమైన, రాజకీయ తప్పిదమే అవుతుంది, సందేహం లేదు.

సరే, ఆధునిక మానవ జ్ఞానచరిత్ర తన స్వీయ చరిత్రే అని పాశ్చాత్య ప్రపంచం భావిస్తోంది. మానజ్ఞానానికి ఏకైక భండారం తమ మేధ అని పాశ్చాత్య దేశాలు మిడిసిపడుతున్నాయి. అహంకరిస్తున్నాయి. ఇది పూర్తిగా చారిత్రక అసంబద్ధం. ప్రాచ్య ప్రపంచం ముఖ్యంగా భారతదేశం ఆ అసంగతాన్ని ఎలా విశ్వసిస్తుంది? సహిస్తుంది? తాము పుట్టి పెరిగిన మాతృభూమి జ్ఞాన వనరులు, మేధో సంప్రదాయాలపై రేపటి తరాలకు అవగాహన లేకుండా చేయడం సాంస్కృతిక వినాశనానికి దారితీస్తుంది. వేల సంవత్సరాల భారతీయ సాంస్కృతిక, నాగరికతా వారసత్వాన్ని మరచిపోవడం లేదా వాటికి దూరమవడం నిస్సందేహంగా రాజకీయ తప్పిదం అవుతుంది. వలసపాలన నుంచి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న నాటి నుంచి మన మేధా సంప్రదాయాలను ఉపేక్షించామన్న గర్హనీయ వాస్తవాన్ని అంగీకరించడం ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థలతో మన బాంధవ్యాన్ని అధునాతనం చేసుకోవడం ప్రారంభమవ్వాలి. భావాలలో స్వరాజ్య సాధనకు సంబంధించిన అజెండాలో భారతీయ జ్ఞానవనరుల పునరుద్ధరణ, పునర్నిర్మాణం అంతర్భాగమవ్వాలి. మేధోపరమైన, సాంస్కృతిక స్వీయ నిర్ణయాధికారమే నిజమైన స్వాతంత్ర్యం అనేది మనం విస్మరించకూడదు.

ఐకేఎస్‌తో సమస్య దాని మౌలిక భావన కాదు, దాని రూపకల్పనే అని చెప్పక తప్పదు భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధనకు ప్రభుత్వం నిర్దేశించిన విధానం భావనాత్మకంగా లోపభూయిష్టమైనది. దానికి సమగ్ర దృక్పథం కొరవడింది. పైగా పలు కుదింపులతో దాని పరిధి సంకుచితమయింది. భారతీయ జ్ఞాన వ్యవస్థలను ప్రాచీనకాలపు అవశేషాలుగా పరిగణించడం మొట్టమొదటి పెద్ద కుదింపు. సజీవ, చైతన్యశీల భారతీయ జ్ఞాన సంప్రదాయాలు పురాతన యుగాలలో మాత్రమే వర్ధిల్లాయా? సుదూర గతంపైన మాత్రమే దృష్టి సారించడం రెండో కుదింపు. ముస్లిం, బ్రిటిష్ పాలనా యుగాలలో సమున్నతంగా జరిగిన మేధో కృషిని ఐకేఎస్ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోంది. జ్ఞాన వ్యవస్థలను కేవలం రాతపూర్వక గ్రంథాలకే పరిమితం చేయడం మూడో కుదింపు. వ్యవసాయం, నేత కార్మికులు, చేతి వృత్తుల వారి దైనందిన కార్యకలాపాలలో నిక్షిప్తమై ఉన్న ఆచరణాత్మక, నిగూఢ జ్ఞానాన్ని విస్మరించడం సమంజసం కాదు. గ్రామీణ సమాజాలలో నేటికీ ఆ జ్ఞాన సంప్రదాయాలు ప్రయోజనకరంగా వర్ధిల్లుతూనే ఉన్నాయి. వాటిని ఉపేక్షిస్తే నష్టం వాటిల్లేది ఎవరికి? ఐకేఎస్ పరిగణనలోకి తీసుకుంటున్న పురాతన గ్రంథాలు పూర్తిగా బ్రాహ్మణీయ మేధో సంప్రదాయానికి చెందినవే కావడం నాలుగో కుదింపు. ప్రాంతీయ, దేశీ సంప్రదాయాలను శోధించక పోవడం సరికాదు. భారతీయ జ్ఞాన వ్యవస్థలను ఆధునిక పాశ్చాత్య ప్రమాణాలు, దృక్కోణాల పరంగా మూల్యాంకనం చేయడం ఒక పెద్ద పొరపాటు. ఇది సత్యావిష్కరణకు ఎలా దోహదం చేస్తుంది?

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## ప్రజావాణిలో 186 వినతుల స్వీకరణ



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుదారుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియతో కలిసి అర్జిదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను జిల్లా కలెక్టర్ శ్రద్ధగా విని, ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా పరిశీలించి, సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, జిల్లా సంక్షేమం, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, విద్య, వైద్యం, గ్రామీణ అభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 186 వినతులను అధికారులు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ రాంరెడ్డి, జడ్పీ సీఈఓ, ఇంచార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ నమాజ్, జంతుబలి నిషేధం.. సీఎం యోగి కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్తంగా బక్రీద్(ఈద్ అల్ అధా) వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఈ మేరకు లఖ్‌నవూలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదులు, ఈద్గాహ్‌ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి సర్కార్ నిర్ణయించింది. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువులను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది.

బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలు, ఈద్గాహ్‌లు, మసీదుల వద్ద అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అల్లర్లకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

బక్రీద్ సందర్భంగా సీఎం యోగి జారీచేసిన 10 కీలక ఆదేశాలివే..

మసీదు ఆవరణలోనే నమాజ్ నిర్వహించాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లో ప్రార్థనలు చేయరాదు.

ప్రార్థనల కోసం రహదారులను అడ్డుకోకూడదు.

జనం ఎక్కువగా ఉంటే, ప్రార్థనలను విడతల వారీగా నిర్వహించాలి.

బహిరంగ ప్రదేశాలలో ఏ రూపంలోనూ జంతుబలి జరగరాదు.

నిషేధిత జంతువుల బలి పూర్తిగా నిషేధించాలి.

జంతు బలుల తర్వాత పరిశుభ్రత పాటించాలి.

అల్లర్లు సృష్టించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలి.

ఈద్గాహ్‌ల వద్ద పోలీస్ బలగాలు మోహరించాలి.

సున్నితమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా చేపట్టాలి.

# రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా పద్మ అవార్డుల ప్రదానం

మొదటి పేజీ తరువాయి

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

# ప్రైవేట్ భాగస్వామ్యంతో తెలంగాణ టూరిజం

వరంగల్ : ప్రైవేట్ రంగ భాగస్వామ్యం ద్వారా పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఎంపిక చేసిన పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి కోసం ప్రభుత్వం త్వరలో ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్(ఈఓఐ) ఆహ్వానిస్తుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఎంపిక చేసిన ఏజెన్సీలకు ప్రాజెక్ట్ డిజైన్లు, అంచనా ప్రాజెక్ట్ నివేదికల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని ఆయన అన్నారు.తెలంగాణను ప్రపంచ స్థాయిలో పోటీపడే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి, పర్యాటకాన్ని ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదక శక్తిగా నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కృష్ణారావు గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ లో జరిగిన 'డెస్టినేషన్ తెలంగాణ – రోడ్ అహెడ్' పర్యాటక సదస్సులో ప్రసంగిస్తూ అన్నారు.పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, పర్యాటక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలని మంత్రి జూపల్లి ఆహ్వానించారు. వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలతో కూడిన ప్రతిపాదనలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, ఆలస్యం లేకుండా ఆమోదాలు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తక్కువగా వినియోగిస్తున్న ప్రభుత్వ ఆస్తులను పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల కోసం దీర్ఘకాలిక లీజుకు ఇవ్వవచ్చన్నారు. తద్వారా పర్యాటక మౌలిక సదుపాయాల అమలు సులభతరం అవుతుందని చెప్పారు. వృత్తిపరమైన నిర్వహణ సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు.వినూత్న, సృజనాత్మక పర్యాటక భావనలను తెలంగాణకు తీసుకురావాలని ప్రైవేట్ భాగస్వాములను మంత్రి జూపల్లి ప్రోత్సహించారు. కొన్ని ప్రాంతాలలో తాగునీరు, మరుగుదొడ్లు, వసతి, రెస్టారెంట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు కొరవడ్డాయని చెప్పారు. మొబైల్ గ్లాస్ హౌస్‌లు, పర్యావరణ పర్యాటక సౌకర్యాలు, కాన్వాస్ టెంట్లు, ఇతర సందర్శకులకు అనుకూలమైన సౌకర్యాలతో సహా ఆధునిక పర్యాటక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వంతో భాగస్వామ్యం కావాలని, ప్రైవేట్ పెట్టుబడిదారులకు, ఆతిథ్య నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.

# ఎబోలా ముప్పు.. ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించిన కేంద్రం

మొదటి పేజీ తరువాయి

ఎబోలా వైరస్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తాజాగా ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇక ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సూచనలు చేసింది. జ్వరం, వాంతులు, అకారణ రక్తస్రావం, తలనొప్పి, వంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఎయిర్‌పోర్టు హెల్త్ ఆఫీసర్‌కు ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే వెల్లడించాలని స్పష్టం చేసింది. ఎబోలా కేసులు అధికంగా ఉన్న డీఆర్‌సీ, ఉగాండా, దక్షిణ సుడాన్‌కు వెళ్లవద్దని కేంద్రం ఇప్పటికే భారతీయులకు సూచించింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో నిఘాను కట్టుదిట్టం చేశారు. లెబొరేటరీలు, క్వారంటైన్ వసతులను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు, ఆఫ్రికాలో ఇప్పటివరకూ 900లకు పైగా ఎబోలా అనుమానిత కేసులు వెలుగు చూశాయని డబ్ల్యూహెచ్‌ఓ తాజాగా వెల్లడించింది. 101 కేసుల్లో ఇప్పటికే వ్యాధి నిర్ధారణ అయ్యిందని వెల్లడించింది. ఇక యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ప్రకారం, ఎబోలా వ్యాప్తి ఎక్కువగా ఉన్న డీఆర్‌సీ దేశంలో 904 అనుమానిత కేసులు వెలుగులోకి రాగా 101 మంది రోగుల్లో ఎబోలా వ్యాధి నిర్ధారణ అయ్యింది. ఇప్పటికే 119 మంది ఎబోలా వల్లే మరణించినట్టు అనుమానాలు ఉన్నాయి. మరో 10 కేసుల్లో ఎబోలా వల్లే మరణాలు సంభించిందని కూడా పరీక్షల్లో తేలింది. మే 24 వరకూ ఉన్న వివరాల ప్రకారం, ఉగాండాలో 5 నిర్ధారిత కేసులు, ఒక ఎబోలా మరణం వెలుగులోకి వచ్చింది. ఆఫ్రికా దేశాల్లో జాతీయ స్థాయిలో ఎబోలా వ్యాప్తి చెందే రిస్క్ ఎక్కువగా ఉందని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. ప్రపంచస్థాయి వ్యాప్తి ముప్పు కొంత తక్కువగా ఉందని పేర్కొంది.

# అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తరలింపును వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు చేసిన వరి ధాన్యం తడిసిపోకుండా వెంటనే మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మూసాపేట్ మండలం వేముల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం (పి.పి.సి)ను కలెక్టర్, హైదరాబాద్ నుంచి వచ్చిన పౌర సరఫరాల డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్‌తో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అకాల వర్షాల కారణంగా కొనుగోలు చేసిన ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి జాప్యం లేకుండా మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో నింపి ఉంచిన గన్నీ సంచులను ఇంకా మిల్లులకు ఎందుకు తరలించలేదని అధికారులను ప్రశ్నించారు. సరిపడా రవాణా వాహనాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఆలస్యం జరుగుతోందని నిర్వాహకులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్‌లకు అదనపు లారీలను



వెంటనే ఏర్పాటు చేసి ధాన్యం సంచులను తక్షణమే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మిల్లుల వద్ద ధాన్యం సంచుల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ట్రక్ షీట్ వివరాలను ఓపీఎంఎస్

## వేముల పి.పి.సి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

యాప్‌లో ఆలస్యం చేయకుండా అప్‌లోడ్ చేయాలని సూచించారు. రైతులకు చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూసాపేట్ మండలంలో ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారనే విషయాన్ని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని నాలుగు కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 420 మంది రైతుల నుంచి 2,617.2 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. మరో మూడు నుంచి నాలుగు రోజుల్లో సుమారు 3 వేల ధాన్యం బస్తాలు కొనుగోలు చేసే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎం రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, మూసాపేట్ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# మహిళా వారోత్సవాల్లో భాగంగా నేడు జిల్లా స్థాయి పోషణ కార్యక్రమం

**ఐడీఓసీలో నిర్వహణ - కలెక్టర్, ప్రజాప్రతినిధుల హాజరు**



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలు (విమెన్స్ వీక్) సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా స్థాయి పోషణ కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూఓ) శ్రీమతి జరీనా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానికంగా లభించే తక్కువ ఖర్చుతో కూడిన పోషకాహార పదార్థాల తయారీ, ప్రదర్శన చేపట్టనున్నారు. అలాగే సమతుల్య ఆహారం (డైటరీ డైవర్సిటీ)పై అవగాహన కల్పించ నున్నారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు పాటించడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాల్సిన అవసరంపై సామూహిక పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చనున్నారు. ఆరోగ్య శాఖ సమన్వయంతో గర్భిణీ స్త్రీలకు రక్తహీనత (అనీమియా) పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, సీడీపీఓలు, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు నిర్దేశించిన సూచనల మేరకు తప్పనిసరిగా పాల్గొనాలని డీడబ్ల్యూఓ జరీనా బేగం కోరారు.

# కేంద్రమంత్రులకు ర్యాంకింగ్స్..

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రివర్గ విస్తరణ త్వరలో ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఈసారి విస్తరణలో తెలంగాణకు మరో మంత్రి పదవి రావొచ్చన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ తరుణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన పాలనా శైలిలో మరో కీలక మలుపు తీసుకుంది. కేంద్ర మంత్రులు, వారి శాఖల పనితీరును వివిధ పారామీటర్ల ఆధారంగా మొదటిసారి ర్యాంకులు ఇచ్చారు. వీటిని క్యాబినెట్ సమావేశంలో ప్రదర్శించడం ఒక సానుకూల అభివృద్ధి. ఈ చర్య ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత జవాబు దారీగా, ఫలితాల దిశగా నడిపించే దిశలో ముఖ్యమైన అడుగు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మొదటి నుంచి తన కేబినెట్‌లో మంత్రులకు, నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు పనితీరులో ర్యాంకులు ఇస్తున్నారు. మోదీ ఇప్పుడు చంద్రబాబును అనుసరిస్తున్నారు. తాజాగా మోదీ ప్రకటించిన ర్యాంకుల్లో కన్స్యూమర్ అఫైర్స్, బొగ్గు, విద్యుత్, వైద్య శాఖలు వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు చూపాయి. ఫిర్యాదుల పరిష్కారం, సంక్షోభ నిర్వహణ, ఫైల్ పారవేయడం, పరిపాలనా సమర్థత వంటి కీలక అంశాల్లో ఈ శాఖలు ముందుండటం గమనార్హం. ముఖ్యంగా వినియోగదారుల సమస్యల పరిష్కారం, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో తీసుకున్న చర్యలు కన్స్యూమర్ అఫైర్స్ శాఖను ప్రత్యేకంగా హైలైట్ చేశాయి. ఈ ర్యాంకింగ్స్ ప్రజలకు మేలు చేసే నిర్ణయాలను త్వరగా అమలు చేయడం, సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం వంటి లక్ష్యాలతో రూపొందించబడింది. ఇది పాలకుల్లో పోటీ మనస్తత్వాన్ని ప్రోత్సహిస్తుంది. నిర్లక్ష్యానికి తావు లేకుండా చేస్తుంది. ప్రభుత్వాలు తరచూ పథకాలు ప్రకటిస్తాయి, కానీ వాటి అమలు, ఫలితాలు చాలా సార్లు వెనుకబడి ఉంటాయి. ఇలాంటి సమయంలో శాఖల పనితీరును కొలిచే స్పష్టమైన మెకానిజం ఉండటం ప్రజా సేవా ధోరణిని బలపరుస్తుంది. ఇది మంత్రులు మాత్రమే కాక, సచివాలయాలు, అధికారుల వరకు కూడా జవాబుదారీతనాన్ని పెంచుతాయి. ఈ విధానం ద్వారా ప్రభుత్వం తన నిర్వహణను కార్పొరేట్ స్టైల్‌లో వ్యవస్థీకరించడం స్పష్టంగా కనిపిస్తోంది. ఫలితాల ఆధారంగా ప్రశంసలు, సూచనలు, అవసరమైతే సవరణలు చేయడం ద్వారా పాలనా సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఎక్కువ.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రంగారెడ్డి : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో జిల్లా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా సహకార అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. జిల్లాలో సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేసి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 37 పీపీసీ కేంద్రాలను ప్రారంభించి, వాటి ద్వారా 7,187 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన రూ. 6 కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైస్ మిల్లర్లు తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలని, ఎలాంటి నాణ్యత కోతలు విధించకుండా ధాన్యాన్ని స్వీకరించాలని సూచించారు. మిల్లుల వద్ద ఏ వాహనం కూడా ఒక రోజు



కంటే ఎక్కువ కాలం నిల్వ ఉండకూడదని హెచ్చరించిన ఆయన, ఎక్కడైనా ఉల్లంఘనలు గమనిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

---

# తడిసిన ధాన్యానికీ గిట్టుబాటు ధర కల్పిస్తాం: మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి

**షాద్‌నగర్ మార్కెట్ యార్డులో 294 మంది రైతుల నుంచి 30 వేల బస్తాల ధాన్యం సేకరణ**

**షాద్‌నగర్, (సమయం ప్రతినిధి):** అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం రైతులు నష్టపోకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి షాద్‌నగర్ మార్కెట్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాద్‌నగర్ మార్కెట్ యార్డుకు సోమవారం 294 మంది రైతులు సుమారు 30 వేల బస్తాల ధాన్యాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే అకాల వర్షాల కారణంగా కొంత ధాన్యం తడవడంతో కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం, కమిషన్ ఏజెంట్లు, కొనుగోలుదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పాక్షికంగా తడిసిన పచ్చి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,400, తేమ తక్కువగా ఉన్న ధాన్యానికి రూ. 2,600 చెల్లించేలా కొనుగోలుదారులతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగనివ్వబోమని, రైతుల కష్టాలను



కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకుంటోందని నాయకులు స్పష్టం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో రైతులకు అండగా ఉంటామని తెలిపారు. రైతులను ఉసిగొల్పి రాజకీయాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కమిటీ సభ్యులు టి. కరుణాకర్, ఎల్. భరత్, టి. సందీప్, టి. నవీన్ కుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎన్. శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పురుషోత్తం రెడ్డి, సయ్యద్ ఖదీర్, మహబూబ్, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, రైతులు పాల్గొన్నారు.

# అటెన్షన్ డైవర్షన్ ముఠా అరెస్టు

**నల్లగొండ :** అటెన్షన్ డైవర్షన్ అంతర్ రాష్ట్ర దొంగలను నల్లగొండ వన్టౌన్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులకు రైతన్నలే టార్గెట్. బ్యాంకుల వద్ద రైతుల కష్టార్జిత డబ్బులపై కన్నేసిన అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ అయింది. బ్యాంకు నుంచి నగదు తీసుకున్న రైతులను ఫాలో అవుతూ, డబ్బులు పడిపోయాయి..బైక్కు ఆయిల్ కారుతోంది..బట్టలపై మురికి పడింది.. అంటూ మాటల్లో పెట్టి దృష్టి మళ్లించి ముఠా నగదు దోచేస్తుంది. నల్గొండ, నకిరేకల్ ప్రాంతాల్లో రైతులను టార్గెట్ చేసిన దొంగలు 24 గంటల్లోనే వన్ టౌన్ పోలీసుల వలలో చిక్కారు. నిందితులనుంచి రూ. 2.20 లక్షల నగదు, బైక్, సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ డి.ఎస్.పి శివరాం రెడ్డి మట్లాడుతూ బ్యాంకుల నుంచి భారీ నగదు తీసుకొస్తే ఒంటరిగా వెళ్లొద్దు. అపరిచితులు మాట్లాడితే అప్రమత్తంగా ఉండండి. బైక్ దగ్గర, నగదు దగ్గర అపరిచితులను నమ్మొద్దు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వండి. ఒక్క క్షణం నిర్లక్ష్యం? జీవితాంతం నష్టం అవుతుంది. రైతన్నలు, ప్రజలు అవగాహనతో నడుచుకోవాలని సూచించారు.

# కులకచర్ల మార్కెట్ యార్డు, ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ రాష్ట్ర బృందం





## రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎంపీ డీకే అరుణ

వికారాబాద్, (సమయం ప్రతినిధి): వికారాబాద్ జిల్లా కులకచర్ల మార్కెట్ యార్డు, ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర బృందం సోమవారం సందర్శించింది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ డీకే అరుణతో పాటు బీజేపీ ప్రజాప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, రైతుల ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రికి రియల్ ఎస్టేట్‌పై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 30 శాతం కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడుస్తూ, ఎండలకు ఎండిపోతూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, రైతుల గోస ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. ఒక్కో ధాన్యం బస్తాకు నాలుగు కిలోల వరకు తరుగు తీస్తున్నారని, సుత్తిలు, హమాలీలకు డబ్బులు కూడా రైతులే చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లోకి ధాన్యం ఎప్పుడు వస్తుందో ప్రభుత్వానికి తెలియదా? కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళిక ఉండదా? అని ప్రశ్నించారు. దళారుల లబ్ధి కోసమే ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు విసిగిపోయి చివరకు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతుల సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతుల ఇబ్బందులు తెలుసుకొని ప్రభుత్వానికి కళ్లుతెరిపించేందుకే బీజేపీ భరోసా యాత్ర చేపట్టినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేపట్టి బస్తాలు అందజేయాలని, మంత్రులు ఉమ్మడి జిల్లాలో పర్యటించి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బస్తాలో 41 కిలోల ధాన్యం మాత్రమే నింపాలని, తరుగు పేరుతో రైతులకు అన్యాయం చేస్తే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేయలేక కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి అలవాటైందని విమర్శించారు. బీజేపీ భరోసా యాత్ర నేపథ్యంలోనే ప్రభుత్వం స్పందించి బస్తాలు పంపుతోందని, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

## ప్రోటోకాల్ ఉల్లంఘనపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**ఆహ్వానం ఇవ్వకుండా అవమానించారని 11వ వార్డు కౌన్సిలర్ పిల్లి శారద ఆరోపణ**



షాద్‌నగర్, (సమయం ప్రతినిధి): ప్రోటోకాల్ నిబంధనలు పాటించకుండా తన వార్డులో చేపట్టిన ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమానికి సమాచారం ఇవ్వకపోవడంతో పాటు ఆహ్వానించకుండా అవమానించారని ఆరోపిస్తూ షాద్‌నగర్ పట్టణ 11వ వార్డు బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్ పిల్లి శారద శేఖర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తన వార్డు పరిధిలో హెచ్ఎండిఏ నిధులతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారని, అయితే ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ప్రజాప్రతినిధిగా తనకు సమాచారం ఇవ్వకపోవడంతో పాటు ఆహ్వానించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ప్రశ్నించగా, ఆ పనులు తన వార్డు పరిధిలోకి రావని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. ఈ అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ పిల్లి శారద పేర్కొన్నారు.

## ప్రజావాణికి 99 ఫిర్యాదులు



జోగులాంబ గద్వాల జిల్లా : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 99 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తో పాటు, అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ ఇవ్వలేదు.. భూజాలపై మృతదేహం తరలింపు

భద్రాచలం : భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. ఆసుపత్రి సిబ్బంది అంబులెన్స్ ఇవ్వకపోవడంతో కుటుంబసభ్యులు మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లారు. భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో నివసిస్తూన్న కండె వెంకన్న (42) వడదెబ్బతో ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మరణించాడు. ప్రభుత్వ ఆసుపత్రి నిబంధనల ప్రకారం మరణించిన వారిని ప్రభుత్వ అంబులెన్స్‌లో ఇంటికి పంపించాల్సి ఉన్నా, వెంకన్నను తరలించేందుకు అంబులెన్స్ ఆసుపత్రి సిబ్బంది ఇవ్వలేదు.

## మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

## మూసాపేట్‌లో 8 ఇందిరా మహిళా శక్తి బస్సుల ప్రారంభం



మూసాపేట్, (సమయం ప్రతినిధి): మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో మహిళా వారోత్సవాల సందర్భంగా సోమవారం మూసాపేట్ మండలంలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో మహిళా సమాఖ్యలకు 8 ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్న కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ఎంటర్‌ప్రైజెస్ వంటి కార్యక్రమాలు మహిళలకు ఆర్థికంగా ఎదిగేందుకు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. మూసాపేట్-అడ్డాకుల ప్రాంతంలో త్వరలో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని, తమ పిల్లలకు మెరుగైన విద్య, ఆరోగ్యం అందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 32 రకాల ఆరోగ్య పరీక్షలను మహిళలు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమాలు మహిళల అభివృద్ధికి ఎంతో దోహద పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, ఆర్టీసీ డీఎం, ఎంపీడీవో, ఎమ్మార్వో, మహిళా సమాఖ్యల ప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి సుమారు 200 మంది మహిళలు హాజరయ్యారు.

## దివ్యాంగ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**
**ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులపై దివ్యాంగుల వినతి**
**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ**





నాగర్ కర్నూల్ ప్రతినిధి: నాగర్ కర్నూల్ జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగుల ప్రతినిధులు తమ సమస్యలను వివరించి పలు కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని తన ఛాంబర్‌లోకి ఆహ్వానించి కూర్చోబెట్టి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో దివ్యాంగులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రతినిధులు కోరారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం రిజర్వేషన్, డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపులో 5 శాతం వాటా, అలాగే ఆర్థికంగా వెనుకబడిన దివ్యాంగ కుటుంబాలకు అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. దివ్యాంగుల సమస్యలు సాధారణ ప్రజావాణిలో పూర్తిగా వినిపించుకునే అవకాశం లేకపోవడంతో, ప్రత్యేకంగా దివ్యాంగుల ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని కూడా ప్రతినిధులు కలెక్టర్‌ను అభ్యర్థించారు. సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను వారు నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వారికి అందాల్సిన హక్కులు, సౌకర్యాలు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రంలోని అంశాలను సంబంధిత శాఖాధికారులతో సమీక్షించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపులో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే అంత్యోదయ కార్డుల మంజూరుపై కూడా పరిశీలన చేపడతామని చెప్పారు. ప్రత్యేక ప్రజావాణి నిర్వహణ అంశంపై కూడా సానుకూలంగా స్పందించిన కలెక్టర్, దివ్యాంగుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ స్పందనపై దివ్యాంగుల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యలను ఓపికగా విని భరోసా కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ ప్రతినిధులు రాజశేఖర్ కృష్ణయ్య, నారాయణమ్మ, మంగమ్మ, దేవేందర్ శంకర్, విజయ్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



## అడ్డాకల్‌లో రైస్ మిల్లులను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

**అడ్డాకల్, (సమయం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి సోమవారం అడ్డాకల్ మండలంలోని రైస్ మిల్లులు, పోలీస్ చెక్‌పోస్ట్‌ను సంయుక్తంగా పరిశీలించారు. ముందుగా గుడిబండ గ్రామంలోని రామాంజనేయ ప్యాడీ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, ఎస్పీ లారీల నుంచి ధాన్యం బస్తాల అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. మిల్లు మొత్తం 1.75 లక్షల బస్తాల సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 35 వేల బస్తాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసినట్లు గుర్తించారు. కేటాయించిన సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యం ఎత్తిపోతలు చేపట్టకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే మరిన్ని హమాలీలను నియమించుకోవాలని, అదనపు రవాణా వాహనాలను ఏర్పాటు చేయాలని, అన్‌లోడింగ్‌కు తగిన స్థలాన్ని సిద్ధం చేయాలని మిల్లర్‌ను ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వం గోదాం సౌకర్యాలు కల్పిస్తుందని, సమీప పీపీసీ కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటనే తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. మరో రెండు రోజుల్లో రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని మిల్లులను బ్లాక్‌లిస్ట్ చేసి వచ్చే సీజన్‌లో కొనుగోళ్లకు అవకాశం ఇవ్వబోమని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే పీపీసీ కేంద్రాలు, మిల్లర్ల మధ్య సమన్వయం పెంచి కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. తదుపరి లక్ష్మీనరసింహ అగ్రోటెక్ రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, అక్కడ నాలుగు ట్రాక్టర్ల ధాన్యం అన్‌లోడింగ్ కోసం పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. లక్ష బస్తాల సామర్థ్యం కలిగిన ఈ మిల్లు ఇప్పటివరకు కేవలం 60 వేల బస్తాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, మిగిలిన 40 వేల బస్తాల ధాన్యాన్ని సమీప పీపీసీ కేంద్రాల నుంచి వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. "తాలు, తరుగు" పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కలెక్టర్, ధాన్యం బస్తాల అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని, తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదనపు రవాణా వాహనాలతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనం తరం మార్గమధ్యంలోని పోలీస్ చెక్‌పోస్ట్‌ను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి షిఫ్ట్‌ల వారీగా విధులు, కేసుల నమోదు, అనుమానాస్పద రవాణాపై నిఘా తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. చెక్‌పోస్ట్ వద్ద పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎం రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## మహిళా వారోత్సవాల్లో జిల్లా స్థాయి పోషణ కార్యక్రమం, మెడికల్ క్యాంపు ప్రారంభం



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పోషణ కార్యక్రమం స్టాల్‌ను, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6వ తేదీ నుంచి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం ఒక్కో థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు పోషకాహార లోపం లేకుండా సమతుల్య ఆహారం తీసుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు పాటిస్తూ జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండేలా సామూహిక పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయల ద్వారా తక్కువ ఖర్చుతో మంచి పోషకాహారం, విటమిన్లు అందుతాయని తెలిపారు. అందుబాటులో ఉన్న దినుసులతో పోషక విలువలు కలిగిన వంటకాలు తయారు చేయడంపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. మెడికల్ క్యాంపులో మహిళలు ఐరన్ శాతం పరీక్షలు చేయించుకున్నారని, గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకొని గర్భిణీ స్త్రీలకు రక్తహీనత (అనీమియా) పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు నుంచి గ్యాస్...

ముంబై : భారతదేశం ఇంధన దిగుమతులపై ఎంతగా ఆధారపడి ఉందో ఇటీవలి ఘటనలు మరోసారి ఉద్ఘాటించాయి. ఎల్‌ఎన్‌జీలో 42 శాతం ఖతార్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. అయితే తాజాగా పశ్చిమాసియా యుద్ధం కారణంగా అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడిచేశాయి. ఇరాన్ గల్ఫ్ దేశమైన ఖతార్‌పై దాడిచేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తడంతో భారత్‌కు ఎల్‌ఎన్‌జీ సరఫరా 30 శాతం పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా 17 శాతం గ్యాస్ సరఫరా తగ్గడం కేవలం భారత్ సమస్య మాత్రమే కాదు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్ స్థిరత్వానికి కూడా హెచ్చరిక. కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఎన్‌జీ కొరత తీర్చడానికి కీలక నిర్ణయం తీసుకుంది. 37,500 కోట్ల రూపాయలతో కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుకు చేపట్టిన నిర్ణయం సమయోచితం మాత్రమే కాదు, దూరదృష్టి కలిగిన వ్యూహాత్మక చర్య. బొగ్గు నుంచి గ్యాస్ ఉత్పత్తి చేసే ఈ సాంకేతికత ద్వారా దేశం దీర్ఘకాలికంగా విదేశీ ఆధారాలను తగ్గించుకోవడం సాధ్యమవుతుంది. ఖతార్, దుబాయ్ వంటి దేశాలపై ఎల్‌ఎన్‌జీ కోసం అత్యధికంగా ఆధారపడటం భారత్ శక్తి భద్రతకు పెద్ద ముప్పు. భౌగోళిక రాజకీయ సంక్షోభాలు ఎప్పుడు ఏ రూపంలో మన సరఫరా గొలుసును దెబ్బతీస్తాయో చెప్పలేం. గతంలో రష్యా?ఉక్రెయిన్ యుద్ధం కూడా ఇంధన ధరలను పెంచి భారత్‌ను ఇబ్బంది పెట్టింది. ఇలాంటి సందర్భాల్లో స్థానిక ఉత్పాదకతను పెంచకపోతే, ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మోదీ సర్కారు చేపట్టిన కోల్ గ్యాసిఫికేషన్ కార్యక్రమం భారత్ చరిత్రలో మొదటి సారి ఇంత పెద్ద స్థాయిలో చేపట్టిన ప్రయత్నం. దేశంలో సమృద్ధిగా ఉన్న బొగ్గు వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, సింథటిక్ గ్యాస్ ఉత్పత్తి చేయడం ద్వారా దిగుమతులు తగ్గించి, విదేశీ మారక నిల్వలను కాపాడవచ్చు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఖతార్‌పై మాత్రమే కాక, మొత్తం ఇంధన దిగుమతులపై ఆధారం తగ్గుతుంది. ఉపాధి అవకాశాలు పెరగడం, బొగ్గు ఉత్పత్తి ప్రాంతాల అభివృద్ధి, శక్తి భద్రత వంటి బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఇది ప్రపంచానికి ఒక మార్గదర్శకంగా నిలవవచ్చు. ఖతార్ వంటి దేశాలపై ఆధారపడిన అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇలాంటి మార్గాలు అన్వేషించేలా చేస్తుంది. అయితే, ఈ ప్రయత్నం సవాళ్లు లేకుండా కాదు. పర్యావరణ భద్రత, కార్బన్ ఉద్గారాల నియంత్రణ, ఆధునిక టెక్నాలజీ అవసరం ఉంది. కార్బన్ క్యాప్చర్ అండ్ స్టోరేజ్ (సీసీఎస్) వంటి సాంకేతికతలను తప్పనిసరిగా అనుసరించాలి. ప్రారంభ దశలో ఖర్చులు ఎక్కువైనా, దీర్ఘకాలిక లాభాలు భారీగా ఉంటాయి. ఇంధన రంగంలో స్వాతంత్ర్యం సాధించడం ఏ దేశానికైనా జాతీయ భద్రతకు సమానం. ఖతార్ సంక్షోభం భారత్‌కు ఒక కఠిన హెచ్చరికగా మారి, స్వయం సమృద్ధి వైపు వేగంగా అడుగులు వేయడానికి కారణమైంది. మోదీ సర్కారు చేపట్టిన కోల్ గ్యాసిఫికేషన్ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేస్తే, ఇది కేవలం ఒక ప్రాజెక్టు కాకుండా, భారత్ ఇంధన విధానంలోనే ఒక చారిత్రక మలుపుగా నిలుస్తుంది. ఈ దిశలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం. సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ రక్షణ, సమర్థవంతమైన అమలుతో ఈ ప్రయత్నం పూర్తి విజయం సాధించాలని ఆశిద్దాం.

# కాక్రోచ్ జనతా పార్టీ హిస్టరీ తెలుసా

న్యూఢిల్లీ : దశ రాజకీయాలను మారుస్తాం.. అవినీతి లేని పరిపాలన అందిస్తాం.. యువత నుంచి మొదలు పెడితే వృద్ధుల వరకు మెరుగైన పరిపాలన అందిస్తాం.. ఇలా సంచలన హామీలతో ఆన్లైన్లో ఏర్పాటు అయింది కాక్రోచ్ జనతా పార్టీ. ఈ పార్టీ ఇప్పటికే ఇన్స్టాగ్రామ్ లో చాలామంది ఫాలోవర్స్ ను పొందింది.. సంచలన ప్రకటనలతో ఇంకా ఇంకా సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడిగా అభిజిత్ కొనసాగుతున్నారు. ఈయన అమెరికాలో చదువుతున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడిగా ఈయన సంచలన విషయాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తున్నారు. దేశ రాజకీయాలను మారుస్తామని, ప్రజలు తమకు సహకరించాలని కోరుతున్నారు. ఎక్కడో అమెరికాలో ఉంటూ.. ఇటువంటి ప్రకటనలు చేస్తున్న అభిజిత్ మీద కొంతమంది విమర్శలు చేస్తుండగా.. మరికొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ అభిజిత్ ఇప్పుడు దేశ రాజకీయాలలో ఒక సంచలన వ్యక్తిగా మారిపోయారు. జనరేషన్ జెడ్ ఉద్యమాన్ని తీసుకురావాలని కోరుతున్న ఈయన.. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీకి పని చేశారు. ఇప్పుడు ఈయన బోస్టన్ లో చదువుకుంటున్నారు. అక్కడి నుంచే కాక్రోజ్ జనతా పార్టీ వ్యవహారాలను నడుపుతున్నారు. సోషల్ మీడియాలో సంచలన సృష్టిస్తున్న అభిజిత్ కు ఇప్పుడు ఒక్కసారిగా దిమ్మ తిరిగిపోయింది. ఆయన ఇన్స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ అయినట్టు తెలుస్తోంది. దాన్ని రికవరీ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను కూడా ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. అయితే ఇప్పుడు పార్టీకి సంబంధించిన సోషల్ మీడియా ఫ్లాట్ఫామ్ మీద ఆయనకు యాక్సిస్ లేకుండా పోయింది. ఒకవేళ ఎవరైనా పోస్టులు చేస్తే.. వాటిని అధికారిక ప్రకటనలుగా భావించవద్దని అభిజిత్ వెల్లడించారు.

# గ్రేటర్ లో బీజేపీ సింగిల్ ప్లేయర్ గేమ్

హైదరాబాద్ : హైదరాబాద్ రాజకీయాల్లో మళ్లీ "గ్రేటర్" డ్రామా షురూ అయింది. ఎప్పట్నుంచో ఊరిస్తున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల నగారా మోగకముందే భాగ్యనగర వీధుల్లో పొలిటికల్ హీట్ మామూలుగా లేదు. పార్టీలన్నీ ఇప్పటికే క్యాలిక్యులేటర్లు.. కులాల మ్యాపులు, వాట్సాప్ వార్‌రూమ్‌లు దుమ్ముదులిపి బయటకు తీశాయి. అయితే ఈసారి అసలు ట్విస్ట్ ఏంటంటే... "మిత్రపక్షం" అనే పదానికి బీజేపీ సరికొత్త డెఫినిషన్ చెప్పబోతోందట.. నిన్నటిదాకా పక్కనే ఉండి మురిసిపోయిన జనసేనకు గట్టిగానే 'హ్యాండ్' ఇచ్చేలా ఉందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. 2020 గ్రేటర్ ఎన్నికల్లో ఊహించని రీతిలో దూసుకొచ్చిన బీజేపీ, అప్పటినుంచి హైదరాబాద్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. "పాతబస్తీ నుంచి పటాన్‌చెరు వరకు కాషాయ జెండా" ఎగరేయాలనే కలతో ముందుకెళ్తోంది. ఇదే ఊపులో మొన్నటి అసెంబ్లీ.. నిన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా భాగ్యనగరంలో తన ఓటు బ్యాంక్‌ను గట్టిగానే పెంచుకుంది. దీంతో ఈసారి జీహెచ్‌ఎంసీలో ఏపీలో కలిసిన కూటమి బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి రచ్చ లేపుతాయని.. సీట్ల పంపకాలు కూడా జరిగిపోతాయని పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ తెగ ఆశపడ్డారు. మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించగానే సోషల్ మీడియాలో "హైదరాబాద్‌లో కూటమి ప్రభంజనం" అంటూ పోస్టర్లు కూడా రెడీ అయిపోయాయి. కానీ బీజేపీ మైండ్ గేమ్ వేరేలా ఉంది. "ఆంధ్రాలో ఫ్రెండ్షిప్ ఓకే బ్రదర్... కానీ హైదరాబాద్ కార్పొరేషన్ మాత్రం మాదే!" అన్నట్టుగా లోపల స్క్రిప్ట్ మార్చేసిందట. తాజా పొలిటికల్ గుసగుసల ప్రకారం బీజేపీ ఈసారి జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 'సింగిల్ ప్లేయర్' గేమ్ ఆడాలని డిసైడ్ అయిందట.. ఎందుకంటే 2020 గ్రేటర్ ఎన్నికల్లో అప్పటికే అభ్యర్థులను ప్రకటించి.. ప్రచారానికి సిద్ధమైన జనసేన... బీజేపీ పెద్దల మాట కోసం లాస్ట్ మినిట్‌లో వెనక్కి తగ్గింది. "పెద్దన్న కోసం త్యాగం" మోడ్‌లో అప్పట్లో సైలెంట్ అయింది. కట్ చేస్తే, ఇప్పుడు ఆంధ్రాలో కూటమి సూపర్ హిట్ అయి పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం రేంజ్‌కు వెళ్లడంతో హైదరాబాద్‌లోనూ తమకు కనీసం ఓ పాతిక, ముప్పై సీట్లయినా ఇస్తారని జనసైనికులు లెక్కలు వేసుకున్నారు. కానీ ఇక్కడే కమలనాథులు తమ పక్కా కమర్షియల్ లెక్కలు బయటకు తీశారు. తెలంగాణలో మా ఓటు... మా సీటు... మా కార్పొరేటర్.. ఇక్కడ వేరే పార్టీలకు స్పేస్ ఇస్తే మా సొంత క్యాడర్ గుస్సా అవుతుంది. పైగా ఓట్లు చీలిపోతే లాభపడేది కాంగ్రెస్, బీఆర్ఎస్సే" అని బీజేపీ ఇంటర్నల్ మీటింగ్స్‌లో తేల్చేసిందట. అంటే జనసేన పరిస్థితి ఇప్పుడు "వచ్చిన వాడిని పంపించలేక.. పోయిన వాడిని ఆపలేక" అన్నట్టుగా తయారైంది. పవన్ కళ్యాణ్ రూట్ మ్యాప్ ఏంటి..? ఇప్పుడు అసలు సిసలైన ప్రశ్న ఏమిటంటే... పవన్ కళ్యాణ్ ఈసారి కూడా "సర్దుకుపోదాం రా.. పెద్ద ల్యాండ్ స్కేప్‌లో ఆలోచించాలి" అంటూ సైలెంట్ అయిపోతారా? లేక "తెలంగాణలో జనసేన ఉనికి చాటాలంటే ఫైట్ తప్పదు బాస్!" అంటూ ఒంటరిగానే బరిలోకి దిగుతారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ జనసేన నిజంగానే ఒంటరిగా పోటీ చేస్తే ఫలితం ఎలా ఉంటుందో ఊహించడం కష్టమే. ఎందుకంటే ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోరు నడుస్తోంది. ఈ ముగ్గురు ఉద్దండుల మధ్య జనసేనకు మైక్ దొరుకుతుందా? లేక కేవలం సోషల్ మీడియా పోస్టర్లకే పరిమితం అవుతుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏదేమైనా గ్రేటర్ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ హైదరాబాద్ రాజకీయాలు థ్రిల్లర్ సినిమాను మించిపోయేలా ఉన్నాయి. ఇక మిగిలింది ఒక్కటే... "కూటమి ఉందా? లేదా? జనసేనకు బీజేపీ సారీ చెప్పిందా?" అన్న సస్పెన్స్‌కు అధికారికంగా ఎండ్ కార్డ్ పడటం.. చూద్దాం.. భాగ్యనగర బాద్‌షా ఎవరో...

# ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ధాన్యం అన్‌లోడ్‌లో జాప్యం సహించం**
**వరి కొనుగోలు ప్రక్రియలో**
**నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు**





**నాగర్ కర్నూల్ ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ఆకస్మికంగా రైస్ మిల్లులను తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పి డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,లతో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్లు, చందుబట్ల ప్రాంతంలోని శ్రీ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్ ను సందర్శించి వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, అన్‌లోడింగ్ ప్రక్రియలను క్షేత్రస్థాయిలో మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు.

తనిఖీల సందర్భంగా మిల్లుల వద్ద పెద్ద సంఖ్యలో వరి ధాన్యం లోడుతో లారీలు రోజుల తరబడి నిలిచిపోయి ఉండటం గమనించిన మంత్రి అధికారులు మిల్లర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని సమయానికి అన్‌లోడ్ చేయకుండా ఆలస్యం చేయడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని మండిపడ్డారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటికే ధాన్యం నిల్వలు పేరుకుపోతుండగా, మిల్లుల్లో సరైన సమన్వయం లేకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోందని సూచించారు.

రైస్ మిల్లుల యాజమాన్యాలను నేరుగా ప్రశ్నించిన మంత్రి, "ధాన్యం అన్‌లోడ్ ప్రక్రియలో ఎందుకు జాప్యం జరుగుతోంది?, రైతుల లారీలు రోజులు తరబడి ఎందుకు నిలిపివేస్తున్నారు?" అంటూ వివరణ కోరారు. రైతులపై అదనపు భారంగా మారుతున్న తాలు, తరుగు పేరుతో జరుగుతున్న అక్రమాలపై కూడా ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రైతులను మోసం చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షించిన మంత్రి, ధాన్యం నిల్వలు అధికమవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులకు కూడా మంత్రి కీలక సూచనలు చేశారు. రైస్ మిల్లులు, గోదాముల వద్ద ప్రతి లారీ సమయానికి అన్‌లోడ్ అయ్యేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని ఎస్పీని ఆదేశించారు. అవసరమైతే మిల్లులు, గోదాముల వద్ద ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి జూపల్లి, "రైతులకు నష్టం కలిగించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోకుండా వెంటనే మిల్లులకు తరలించి అన్‌లోడ్ చేయాలి. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలను మరింత వేగవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రికి, కలెక్టర్ తెలిపారు.రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కడా నిల్వలుగా పేరుకుపోకుండా తక్షణమే రైస్ మిల్లులకు తరలించేలా అన్ని శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేసేలా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలు, రవాణా శాఖ, మిల్లుల యాజమాన్యాల మధ్య సమయపాలన తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మిల్లుల వద్ద లారీల అన్‌లోడింగ్‌లో జాప్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ కోసం తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందిని ప్రత్యేకంగా నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి బయలుదేరే ధాన్యం లారీ కదలికను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని, తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావుకు కలెక్టర్ వివరించారు.

రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చూడటం జిల్లా యంత్రాంగం ప్రధాన బాధ్యత అని,తాలు, తరుగు వంటి అంశాల్లో పారదర్శకత కోసం స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేసే, అక్రమాలు జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని మిల్లర్లకు కలెక్టర్ హెచ్చరించారు. రైస్ మిల్లుల వద్ద నిల్వలు, అన్‌లోడింగ్ ప్రక్రియపై రోజువారీ సమీక్ష నిర్వహించి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మంత్రికి, తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్ , డి.ఎస్.పి శ్రీనివాసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహేష్ గౌడ్ కు పొగపెడుతున్నారా...

హైదరాబాద్ : ఏం జరిగిందో తెలియదు. ఏం జరుగుతుందో కూడా తెలియదు. కాకపోతే మాడు వాసన వస్తోంది. దీనికి బాధ్యులు ఎవరు అనే ప్రశ్న ఎదురైనప్పుడు.. ఎవరు కూడా తమకేం తెలియదు అన్నట్టుగా మొహాలు పెడుతున్నారు.. కానీ ఇలా పార్టీ ప్రజల్లో పరువు పోగొట్టుకుంటుంటే.. ఆ తదుపరి ఏం జరుగుతుందనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్నది ఇదే.ఆ మీడియా ఛానల్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ కి సంబంధించిన అనుకూలమైన వార్తలు.. ప్రభుత్వానికి సంబంధించిన అడుకూలమైన కథనాలను అది ప్రసారం చేస్తూ ఉంటుంది. అటువంటి చానల్లో ఉన్నట్టుండి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు వ్యతిరేకంగా కథనాలు ప్రసారమవుతున్నాయి. ఇది ఒక రకంగా ఆశ్చర్యాన్ని కలిగించింది. అసలు మహేష్ కుమార్ గౌడ్ కు పొమ్మనలేక పగబెడుతున్నారా అని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.. ప్రతిష్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత మహేష్ కుమార్ గౌడ్ క్యాడర్ కు దగ్గరగా ఉండటం లేదు.. ప్రభుత్వ పథకాలను ఆయన ప్రచారం చేయడం లేదు. విదేశాలలో ఎక్కువ సమయం ఉంటున్నారు. పార్టీకి సంబంధించిన సామాజిక మాధ్యమాల విభాగాలను కూడా అంతగా శక్తివంతం చేయలేదు. దీంతో భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా రెచ్చిపోతుంది. కొన్ని సందర్భాలలో ప్రభుత్వాన్ని తీవ్రమైన ఇరకాటంలో పెడుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే.. మహేష్ కుమార్ గౌడ్ పెద్దగా పట్టించుకోవడంలేదని ఆ చానల్లో వరుసగా కథనాలు ప్రసారం అయ్యాయి.ఆ చానల్ యాజమాన్యంలో కొంతమంది వ్యక్తులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత దగ్గర మిత్రులని తెలుస్తోంది. ఇటీవల మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆ ఛానల్ యాజమాన్యానికి సంబంధించిన దగ్గర వ్యక్తికి ఇవ్వలేదని.. అందువల్లే మహేష్ కుమార్ గౌడ్ మీద ఈ స్థాయిలో నెగిటివ్ వార్తలు ప్రసారం చేస్తున్నారనే వాదనలు లేకపోలేదు. అయితే మహేష్ కుమార్ గౌడ్ ఆ చానల్ తనపై ప్రసారం చేసిన వ్యతిరేక కథనాల పట్ల స్పందించారు. మీడియా మీద గౌరవం ఉంది కాబట్టి తాను ఏమీ అనలేకపోతున్నారని.. కాలమే అన్నిటికి సమాధానం చెబుతుందని ఆయన ప్రకటించారు.ఆ చానల్ ప్రసారం చేసిన కథనాన్ని కాస్త పక్కన పెడితే మహేష్ కుమార్ గౌడ్ టీపిసిసి ప్రెసిడెంట్ అవ్వడానికి ముఖ్య కారకుల్లో రేవంత్ రెడ్డి కూడా. పైగా ఇటీవల ఆయన 2034 వరకు కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మహేష్ కుమార్ గౌడ్ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీ ముఖ్యమంత్రి అవతారని అన్నారు. రేవంత్ రెడ్డి ఆ ప్రకటన చేసిన తర్వాత.. మహేష్ కుమార్ గౌడ్ బీసీ ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించడం సీఎం రేవంత్ రెడ్డికి నచ్చలేదని తెలుస్తోంది. పైగా కాంగ్రెస్ పార్టీలో మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ ఒక వర్గంగా.. రేవంత్ రెడ్డి మరొక వర్గం గా ఉన్నారని ప్రచారం జరుగుతుంది. అయితే మహేష్ కుమార్ గౌడ్ మీద ఇలాంటి కథనం ప్రసారం కావడం పట్ల కాంగ్రెస్లో ఉన్న అంతర్గత పోరు మరొకసారి బయటపడింది.

కాంగ్రెస్ పార్టీ దక్షిణ భారత దేశంలో మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉంది.. తమిళనాడులో అధికార భాగస్వామి పార్టీగా ఉంది.. అయితే కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణనే కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకంగా ఉంది. ఎందుకంటే ఇక్కడ నాయకులు అధిష్టానానికి ఇప్పుడు బలమైన మద్దతు ఇస్తున్నారు. అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత పోరుతో అసలుకే మోసం తెచ్చుకునే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## ఎన్ఆర్ ఐ తమ్ముళ్ల మధ్య విబేధాలు

నెల్లూరు : తెలుగుదేశం ఎన్ఆర్ఐ విభాగంలో వర్గ విభేదాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయని అంటున్నారు. గల్ఫ్ దేశాల్లో టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. విదేశాల్లోనూ ఈ తరహా రాజకీయంతో పార్టీకి తలనొప్పిగా మారుతున్నారని పలువురు ఎన్ఆర్ఐ టీడీపీ నేతలపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా గల్ఫ్ టీడీపీ విభాగంలో కొనసాగుతున్న ఆధిపత్య పోరుతో పార్టీ నేతలు పరస్పరం ముఖాలు కూడా చూసుకోని బద్ధ విరోధుల్లా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితులతో గల్ఫ్ టీడీపీలో గందరగోళం చోటుచేసుకుందని చెబుతున్నారు.ఇక ఎన్ఆర్ఐ నేతల వ్యవహారశైలితో గల్ఫ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొనేందుకు వెళుతున్న రాష్ట్ర నేతలు కూడా ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. అయితే ఒక నేత మాత్రం వర్గాలను పెంచేలా వ్యవహరిస్తున్నారని జరుగుతున్న ప్రచారం మరింత హీట్ పుట్టిస్తోందని అంటున్నారు. తరచూ గల్ఫ్ కు వస్తున్న ఆ నేత అగ్నికి ఆజ్యం పోసేలా ప్రవర్తిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక గల్ఫ్ టీడీపీలో విభేదాలు ఉన్నట్లు జరుగుతున్న ప్రచారం ఎన్ఆర్ఐ టీడీపీలో కలవరం పుట్టిస్తోందని అంటున్నారు. ఎన్ఆర్ఐ నేతలుగా చెప్పుకునే వారు కూడా పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని, స్థానికంగా ఉన్న కార్యకర్తలను కూడా కలవడం లేదని అంటున్నారు. విదేశాల నుంచి వచ్చే పార్టీ నేతలను కలిసేందుకు కూడా గల్ఫ్ లో ఉన్న ఒక పెద్ద ఇష్టపడటం లేదని అంటున్నారు. ఆయన అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదన్న చర్చ ఆసక్తి రేపుతోంది. రాజకీయంగా కీలకమైన గల్ఫ్ ప్రాంతాన్ని పార్టీ నాయకత్వం నిర్లక్ష్యం చేయడంపై కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారని అంటున్నారు. మరోవైపు పార్టీ హైకమాండ్ గల్ఫ్ టీడీపీని పట్టించుకోవడం లేదని, ఎక్కువగా అమెరికా, బ్రిటన్‌లో ఉండే పార్టీ నేతలకే అవకాశాలు ఇస్తున్నారని, ఆయాశాఖలకే ప్రాధాన్యం ఇస్తున్నారని పశ్చిమాసియాలో ఉన్న కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గల్ఫ్ టీడీపీ విభేదాలు ఉన్నాయనే విషయం తాజాగా మరోమారు బయట పడింది. పార్టీ మహానాడుకు ముందు జిల్లాల్లో మినీ మహా నాడు నిర్వహించినట్లే, విదేశాల్లో సమావేశాలు జరుగు తున్నాయి. ఇక శుక్రవారం ఖతార్‌లో నిర్వహించిన కార్య క్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొలుసు పార్థసారథి హాజర య్యారు. అయితే మరోవర్గం కూడా ఖతార్ లో సమావేశం ఏర్పాటు చేసి దీనికి పెనమలూరు ఎమ్మెల్యే బొడే ప్రసాద్ ను ముఖ్య అతిథిగా తీసుకువచ్చింది. దీంతో ఒకే రోజు, ఒకే దేశంలో రెండు వేర్వేరు సమావేశాలు జరగడం కార్యకర్తల్లో గందరగోళానికి దారితీసిందని అంటున్నారు. ఈ పోటాపోటీ కార్యక్రమాలను అడ్డుకునేందుకు రెండు పక్షాలు చివరి వరకు ప్రయత్నించాయని కూడా చెబుతున్నారు. ఈ పరిణామాలు గల్ఫ్‌లో ఉంటున్న టీడీపీ కార్యకర్తలను ఆవేదనకు గురి చేస్తున్నాయి. పశ్చిమాసియాలో సుమారు 5 లక్షల మంది తెలుగువారు పనిచేస్తున్నారని చెబుతున్నారు. ఇందులో గోదావరి జిల్లాల వాసులతోపాటు రాయలసీమ ప్రాంతానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నారని అంటున్నారు. పార్టీలో పరిణామాలను ప్రత్యర్థులు అనుకూలంగా మలచుకునే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. గల్ఫ్ లోనే ఉంటున్న మలయాళీలు పార్టీలను బలోపేతం చేసుకుంటుంటే, టీడీపీలో మాత్రం భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని కార్యకర్తలు వాపోతున్నారు. ప్రధానంగా గ్రూపు రాజకీయాలు, కులాల ఆధిపత్యం వల్ల పార్టీకి నష్టం చేస్తోందన్న వాదన వినిపిస్తోంది. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు హైకమాండ్ తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కొత్త పీసీసీ ఛీఫ్ గా పద్మావతి..?

నల్గొండ : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై చూపిస్తున్న శ్రద్ధ, సంస్థాగత బలోపేతంపై చూపించలేదనే విమర్శలు ఉన్నాయి. టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించి దాదాపు ఏడాదిన్నర గడిచింది. అయినా ఇప్పటివరకు పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటించలేదు. కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, అన్నింటికీ మించి కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం వాయిదా పడుతూ వస్తోంది. అయితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రతిష్ఠంభనకు తెరదించేందుకు అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసిందిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో గాంధీభవన్ వేదికగా ఈ నియామకాలపై తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ కసరత్తులో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధానమైన పేరు.. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్. వాస్తవానికి ఆమె కేబినెట్ హోదాతో కూడిన కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని ఆశించినట్లు గాంధీభవన్ వర్గాల్లో టాక్ నడిచింది. అయితే, ఇప్పటికే ఆమె భర్త ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో కీలకమైన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రిగా కొనసాగుతున్నారు. ఒకే ఇంటికి రెండు కేబినెట్ ర్యాంక్ పదవులు ఇస్తే పార్టీలోనే కాకుండా, ప్రజల్లోనూ ప్రతికూల చర్చకు దారితీస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెకు ప్రభుత్వ పదవి కాకుండా, పార్టీలో అత్యంత కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని పెద్దలు వ్యూహం రచించారు.పద్మావతి రెడ్డికి ఈ పదవి ఇవ్వడం వెనుక అధిష్ఠానం అనేక సామాజిక, రాజకీయ లెక్కలను వేస్తోంది. పార్టీ కమిటీల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలనే రాహుల్ గాంధీ సంకల్పానికి ఇది అద్దం పడుతుంది. రెడ్డి సామాజికవర్గానికి చెందిన సీనియర్ మహిళా నాయకురాలిగా పద్మావతికి ఈ పదవి ఇవ్వడం ద్వారా ఆ కోటాను కూడా భర్తీ చేసినట్లవుతుంది. ఒకే ఒక నియామకంతో అటు మహిళా కోటా, ఇటు రెడ్డి సామాజిక సమీకరణం.. రెండింటినీ బ్యాలెన్స్ చేయవచ్చనేది కాంగ్రెస్ పెద్దల ఆలోచన.టీపీసీసీలో మొత్తం నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లకు అవకాశం ఉంది. పద్మావతి నియామకంతో ఒక స్థానం భర్తీ అయితే, మిగిలిన మూడు స్థానాల కోసం గాంధీభవన్‌లో తీవ్రమైన చర్చ నడుస్తోంది. సామాజిక న్యాయం అనే సూత్రం ఆధారంగా ఈ మిగిలిన మూడు స్థానాలను కేటాయించాలని ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పట్టుబడుతున్నారు. ఒక స్థానాన్ని మహిళ, రెడ్డి కోటాలో ఉత్తమ్ పద్మావతికి ఇస్తే.. రెండో స్థానాన్ని వెనుకబడిన తరగతులకు ఇచ్చే అవకాశం ఉంది. మూడో స్థాన్ని ఎస్సీ, నాలుగో స్థానాన్ని ఎస్టీలతో భర్తీ చేయవచ్చు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా, బలమైన సంస్థాగత నెట్‌వర్క్ ఉంటేనే క్షేత్రస్థాయిలో విజయం సాధ్యమని అధిష్ఠానం గుర్తించింది. ఈ కమిటీల భర్తీ ద్వారా అటు అసంతృప్త నాయకులను బుజ్జగించడం, ఇటు ఎన్నికల సమరానికి క్యాడర్‌ను సమాయత్తం చేయడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.



# బౌద్ధం పల్లవించిన నేల

**వైశాఖ పౌర్ణమి ఎంతో ప్రత్యేకమైన రోజు. గౌతమ బుద్ధుడు జన్మించిన రోజే కాదు, ఆయన జ్ఞానోదయం పొందినదీ, మహా పరినిర్వాణాన్ని పొందినదీ ఈ రోజే. ఈ పవిత్రమైన రోజును ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులు 'వేసాక్' పండుగగా భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు.**

**రాజకుమారుడైన సిద్ధార్థుడు జీవితంలో దుఃఖాలను చూసి, వాటిని సంపూర్ణంగా రూపుమాపాలని సంకల్పించాడు. సర్వ సౌఖ్యాలను పరిత్యజించి, తపోధ్యాన నిష్టలతో... బుద్ధ గయలో సాధన చేసి, చివరకు సమాధానాన్ని కనుక్కోగలిగాడు. బుద్ధునిగా మారాడు. లోకానికి అహింస, సత్యం, శాంతి, దయా మార్గాలను చూపించాడు. చతురార్య సత్యాలతో, అష్టాంగ మార్గం ద్వారా మనిషి ఉత్కృష్ట జీవితం ఎలా గడపాలో తను ఆచరించాడు, ఉపదేశించాడు.**

## జ్ఞానపిపాసి బావరి...

ప్రాచీన కాలంలో ఆంధక దేశంగా విఖ్యాతి పొందిన ఈ తెలుగు భూమి... బౌద్ధ ధర్మ చరిత్రలో ఒక దివ్య అధ్యాయంగా నిలిచింది. ఈ నేల బుద్ధుని బోధలను ఆహ్వానించడమే కాదు... వాటిని ఆత్మలో నిలుపుకొంది. తాత్త్విక వికాసానికి, ఆధ్యాత్మిక ప్రసారానికి కేంద్రబిందువయింది. గోదావరి తీరంలో తపస్సంపన్నుడైన బావరి మహర్షి నుంచి శూన్యతాతత్త్వాన్ని విశదీకరించిన నాగార్జునుడి వరకు... ఈ ప్రాంతం బౌద్ధంతో అంతర్లీనంగా అనుసంధానమయింది. బావరి కథ ఆ అనుబంధానికి తొలి సాక్ష్యంగా నిలుస్తుంది. గోదావరి నదీ తీరాన ఆశ్రమవాసిగా నివసించిన బావరి... జ్ఞానపిపాసతో నిండిన మహర్షి. బుద్ధుడు బోధి సంపూర్ణుడై వెలుగొందిన వార్త విని... తన శిష్యులను ఆయన సన్నిధికి పంపించాడు. వారు బుద్ధుని దర్శించి, బుద్ధ వాక్యామృతాన్ని ఆస్వాదించి, సత్య సాక్షాత్కారాన్ని పొందారు. ఈ ఘట్టం ద్వారా... బుద్ధుని జీవిత కాలంలోనే ఆంధక దేశానికి బౌద్ధ ధర్మ ప్రవాహం చేరినట్టు స్పష్టమవుతుంది. తరువాత ఈ ప్రాంతం బౌద్ధ సంస్కృతికి పుష్టిని ఇచ్చిన పుణ్యభూమిగా పరిణమించింది. కృష్ణా, గోదావరి నదుల సస్యశ్యామల తీరాలు సంపన్న జీవన విధానాన్ని ప్రసాదించి... విహారాలు, స్తూపాలు, చైత్యాల నిర్మాణానికి దోహదపడ్డాయి. అమరావతి, నాగార్జున కొండ, ధూలికట్ట లాంటి క్షేత్రాలు నేటికీ ఆ వైభవానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అక్కడి శిలాశాసనాలు, శిల్ప కళాకృతులు, విహారావశేషాలు... ఇవన్నీ కలిసి బౌద్ధం ఈ నేలపై ఎంతగా విస్తరించిందో మౌనంగా వివరిస్తున్నాయి.

## నాగార్జునుడి 'శూన్యతా' సూత్రం

ఈ ఆధ్యాత్మిక వేదికపై ప్రకాశించిన మహామేధావి నాగార్జునుడు. ఆయన మహాయాన బౌద్ధంలో మాధ్యమిక తత్త్వానికి రూపకల్పన చేసి... 'శూన్యత' అనే సూత్రాన్ని లోతుగా ప్రతిపాదించాడు. సర్వ ధర్మాలకూ స్వతంత్ర రూపం లేదని, పరస్పరాధారితత్వమే సత్యమనీ ఆయన బోధించాడు. ఈ తాత్త్విక దృక్పథం బౌద్ధాన్ని మరింత విశాలంగా, లోతుగా విస్తరింపజేసింది. ఆయన శిష్యుల్లో ఆర్యదేవుడు లాంటి ఆచార్యులు కూడా ఈ తత్త్వ జ్ఞానాన్ని మరింత ప్రచారం చేశారు.

## మళ్ళీ మళ్ళీ జన్మించడమే దుఃఖం

ఈనాడు కొందరు బౌద్ధాన్ని వారు నమ్మిన సిద్ధాంతాలతో జోడించి... తదనుగుణంగా బుద్ధుడి బోధనలను వ్యాఖ్యానించడం విచారకరం. అసలు బుద్ధుడు ఏ విషయాలను వివరించాడో తెలుసుకోకుండా... సామ్యవాది అని కొందరు అంటే, మరికొందరు వర్ణ వ్యవస్థను నిర్మూలించడానికి మాత్రమే అవతరించిన సామాన్య సమాజోద్ధారకుడిగా వర్ణించడం శోచనీయం. బౌద్ధం ఆచార ప్రధానమైనది. వ్యక్తి నైతిక సదాచారాలతోనే మోక్ష మార్గంలోకి ప్రవేశించగలుగుతాడని బుద్ధుడు వివరించాడు. దుఃఖ నిరోధమే నిర్వాణం. 'దుక్ఖా జాతి పునప్పునంఖ' (మళ్ళీ మళ్ళీ జన్మించడమే దుఃఖం) అన్న బుద్ధుడి తాత్త్వికోపదేశమే శంకరుల ద్వారా 'పునరపి జననం పునరపి మరణం' అనిపించింది. బౌద్ధ సాహిత్యం సంస్కృత, పాళీ భాషలలో సమృద్ధమై విలసిల్లింది. కాని నేడు రెండు కారణాలవల్ల ఆ అద్భుత సాహిత్యం మరుగునపడింది. అందులో మొదటిది... ఇంత విశాలమైన సాహిత్యాన్ని చదివే నాథులే లేరు, రెండోది... ఈ అద్భుత సాహిత్యాన్ని చదవకుండానే ఇది నాస్తికమని, సనాతన విరుద్ధమని భావించడం. ఇది దురదృష్టకరం. బుద్ధుని బోధనలను అందరూ చదివి తీరాలి.

ఆంధక దేశంలోని విహారాలు ప్రార్థనాలయాలుగానే కాకుండా... జ్ఞాన కేంద్రాలుగా, తాత్త్విక సంభాషణలకు వేదికలుగా వికసించాయి. వాణిజ్య మార్గాల సామీప్యం ఈ ప్రాంతాన్ని శ్రీలంక, దక్షిణాసియా దేశాలతో అనుసంధానించింది, బౌద్ధ ధర్మాన్ని సముద్రాలు దాటి విస్తరింపజేసింది. అమరావతి శిల్ప కళలో బుద్ధుని జీవగాథలు, జాతక కథలు సజీవ చిత్రాల్లా ఆవిష్కృతమై, దర్శనార్థులను ధ్యాన ముగ్ధుల్ని చేస్తాయి. ఆ శిల్ప రేఖల్లో తత్త్వం పలుకుతుంది. ఆ కళలో కరుణ నిండుగా కనిపిస్తుంది.

పవిత్రమైన బుద్ధ జయంతిరోజున మనం మనలోని కోపం, ద్వేషం, అసూయలను వదిలిపెట్టాలి, ప్రేమ, దయ, సహనంతో జీవించడానికి ప్రయత్నించాలి. పేదలకు సహాయం చేయాలి. ఇతరులకు సంతోషం కలిగించాలి. అదే బుద్ధుడికి నిజమైన నివాళి.



# తేనెలూరే అభిరుచి

మంచి జీతం... సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలిపెట్టి... కష్టమని తెలిసినా తేనె సాగు చేపట్టారు. అమెరికాలో వ్యవసాయం చేస్తున్న అక్క స్ఫూర్తితో... అంకుర సంస్థను స్థాపించి అభిరుచికి పట్టం కట్టారు. సవాళ్లను స్వీకరించి... ఒడుదొడుకులను అధిగమించి... మరికొంత మంది మహిళలకు ఉపాధి మార్గమయ్యారు. విభిన్న రంగంలోకి అడుగిడి... అందరి ప్రశంసలు అందుకొంటున్న యువతి... కూచిపూడి కృష్ణవేణితో మాటామంతి.

"అందరిలా చదువు కాగానే నేనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వెంట పరుగెత్తా. రెండేళ్లు ఐటీలో పని చేశా. కానీ సంతృప్తినివ్వలేదు. అందుకే ఆ కొలువు వద్దనుకుని బయటకు వచ్చేశాను. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ చదివే రోజుల్లోనే నాకు వ్యవసాయంపై మక్కువ కలిగింది. మా పొలంలోనే సేంద్రియ సాగు చేసి లాభసాటి వ్యవసాయాన్ని మా నాన్నకు బహుమతిగా ఇవ్వాలనుకున్నా. కానీ అనుకున్నవన్నీ జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది! గుంటూరు జిల్లా తెనాలిలో ఓ చిన్న ఇంట్లో మా నివాసం. నాన్న కూచిపూడి బసవపున్నయ్య. అమ్మ వెంకటేశ్వరమ్మ. ఐదుగురు సంతానంలో నలుగురు అక్కచెల్లెళ్లం. నాన్న మాకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసి, మమ్మల్ని అందరినీ ప్రయోజకులను చేశారు. ఆయన పడ్డ కష్టానికి ఫలితంగా ఐదుగురం సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదించాం.

## ఆ ఇష్టంతోనే...

నాకు మొదటి నుంచీ ఆర్గానిక్ సాగుపై ఇష్టం ఉండేది. కానీ కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో అది కుదరలేదు. ఇంజినీరింగ్ అయ్యాక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. రెండేళ్ల అతి కష్టం మీద పని చేశాను. ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో... ఎప్పుడు పోతుందో తెలియని సందిగ్ధంలో... రోజుకొక గండంలా గడుపుతున్న నా సహచరులను ఎందరినో చూశా. ఉద్యోగం ఉన్నా భరించలేని ఒత్తిడి. ఇలాంటి కొలువుల్లో కొనసాగడం నావల్ల కాదని ఐటీ నుంచి బయటకు వచ్చేశాను. తర్వాత చెన్నైలోని ఓ అగ్రీ కంపెనీలో చేరాను. ఆ ఉద్యోగం చేస్తున్నప్పుడే ఒక కొటేషన్ నన్ను బాగా అకట్టుకుంది. 'ఒకవేళ భూమిపై నుంచి తేనెటీగలు కనుమరుగైపోతే, మానవుడు జీవించటానికి కేవలం నాలుగు సంవత్సరాల ఆయుష్షు మాత్రమే మిగిలి ఉంటుంది'... అనేది కొటేషన్. అంటే తేనెటీగలు లేకపోతే మొక్కలలో పరాగ సంపర్కం ఉండదని, మొక్కలు లేకపోతే జంతువులు, మానవుడి మనుగడ భూమిపై ఉండదనేది దాని అర్థం. ఇప్పటికే తుమ్మెదలు చాలావరకు అంతరించిపోయాయి. తేనెటీగలే ఫల సాయానికి కీలకంగా మారాయి. వీటిని కూడా కాపాడుకోలేకపోతే రేపటి రోజున మా నాన్న లాంటి రైతులు ఏమైపోతారనే ఆందోళన మొదలయింది. దీన్ని అందరికీ అర్థమయ్యేలా చెప్పాలనే ఉద్దేశంతోనే... ఆ ఉద్యోగం కూడా వదిలేసి తేనె పరిశ్రమ పెడదామని నిర్ణయించుకున్నా.

## సోదరి స్ఫూర్తితో...

విషయం నాన్నతో పాటు అమెరికాలో ఉన్న నా సోదరి రాజ్యలక్ష్మికి చెప్పాను. తను అక్కడ కొద్దిపాటి భూమిలో సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తోంది. తనే నాకు స్ఫూర్తి. పూర్తి స్థాయి అవగాహన కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ కె.మోహనరావును, హనీబీ రైతు సంఘాలను కలిశాను. తెనాలికి తిరిగివచ్చి రూ. 1.5 లక్షలతో 200 తేనె పెట్టెలు తీసుకున్నా. అయితే ఆ పెట్టెలను అమర్చటం చాలా కష్టం.

# చుండ్రు వేధిస్తోందా..

**ఎండాకాలంలో వేడివల్ల తలలో అధికంగా చెమట పట్టి చుండ్రు మాడుకు అతుక్కుపోతుంది. దీంతో తలంతా దురదగా అనిపిస్తుంటుంది. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో ఈ చుండ్రును వదిలించుకోవచ్చు.**



చిన్న గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసాన్ని తీసుకుని అందులో అయిదు చెంచాల మంచినీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్ది కొద్దిగా తీసుకుంటూ మాడుకు పట్టించి పావుగంట తరువాత గోరువెచ్చటి నీటితో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే మాడు మీద పీహెచ్ స్థాయిలు సమతుల్యమై చుండ్రు మాయమవుతుంది.

పెద్ద గిన్నె నిండా నీళ్లు పోసి అందులో రెండు గుప్పెళ్ల వేపాకులు వేసి బాగా మరిగించాలి. ఈ నీటిని గోరువెచ్చగా చల్లార్చి తలకు పట్టించి అరగంట తరువాత తలస్నానం చేస్తే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

రాత్రి పడుకునేముందు చిన్న కప్పు మెంతులను నీళ్లలో నానబెట్టాలి. ఉదయాన్నే వీటిని మెత్తగా రుబ్బి తలకు పట్టించి అరగంట తరువాత గోరువెచ్చటి నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే మాడుమీద చర్మం తేమతో నిండి చుండ్రు తగ్గుతుంది.

కలబంద గుజ్జును చల్లటి నీటిలో ముంచి తీసి మాడుకు పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తూ ఉంటే కలబందలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ప్రభావవంతంగా పనిచేసి చుండ్రును తొలగిస్తాయి.

పెరుగు లేదా కోడిగుడ్డు తెల్ల సొనను మాడుకు పట్టించి తలస్నానం చేసినా మంచి ఫలితం కనిపిస్తుంది.

యాపిల్ సైడర్ వెనిగర్, మంచినీళ్లను సమపాళ్లలో కలిపి తలకు పట్టించి ఒక పూట తరువాత తలస్నానం చేసినా ప్రయోజనం ఉంటుంది.

రెండు చెంచాల కొబ్బరి నూనెలో చెంచా టీ ట్రీ ఆయిల్ కలిపిన మిశ్రమాన్ని లేదా మందార నూనెను పట్టించినా చుండ్రు తొలగి మాడు ఆరోగ్యవంతంగా మారుతుంది.

# Cinema



# పెద్ది' మూవీ నుంచి మాస్ సాంగ్ అఫ్ ది ఇయర్ 'హల్లల్లల్లో"

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ అవైటెడ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలను సృష్టించింది. ఇటీవల విడుదలైన పవర్‌ఫుల్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నారు. రగ్డ్ యాక్షన్, బలమైన ఎమోషన్స్, భారీ కాన్వాస్‌తో రూపొందిన గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఈ చిత్రానికి సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్స్‌గా నిలవగా, తాజాగా మూడో సింగిల్ 'హల్లల్లల్లో' కూడా అదే జోరును కొనసాగిస్తోంది. భోపాల్‌లో నిర్వహించిన భారీ 'పెద్ది కీ ఆవాజ్' ఈవెంట్‌లో ఈ పాటను లాంచ్ చేయగా, ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. అనంతరం డిజిటల్‌గా విడుదలైన ఈ పాట అంచనాలకు మించి ఆదరణ దక్కించుకుంటోంది.

భారీ బీట్స్, డ్రమ్స్, జానపద శైలిలో సాగే రిథమ్‌తో ఏఆర్ రెహమాన్ ఈ పాటను మాస్ యాంథమ్‌లా తీర్చిదిద్దారు. మొదటి క్షణం నుంచే ఆకట్టుకునే ఈ ట్యూన్ ఆఖరి వరకు అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తుంది. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం పాటకు మరింత మాస్ అప్పీల్‌ను తీసుకొచ్చింది. జానపదంతో కూడిన పదాలు పాటకు ప్రత్యేకమైన నేటివిటీని అందించాయి. రక్షితా సురేష్ తన పవర్‌ఫుల్ వాయిస్‌తో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆమె వాయిస్ లోని ఎనర్జీ, రెహమాన్ బీట్స్‌తో కలిసి వినసొంపైన సంగీతాను భూతిని అందిస్తోంది. విజువల్‌గా'హల్లల్లల్లో' ఒక గ్రాండ్ స్పెక్టకిల్‌లా కనిపిస్తోంది. భారీ సెట్‌లో చిత్రీకరించిన ఈ పాటలో రామ్ చరణ్, శృతి హాసన్, జాన్వీ కపూర్ ముగ్గురూ అదిరిపోయే స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. రామ్ చరణ్ తన స్టైలిష్ లుక్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో ప్రేక్షకులని మెస్మరైజ్ చేశారు, శృతి హాసన్ తన గ్లామర్, గ్రేస్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జాన్వీ కపూర్ కూడా తన ఎలిగెన్స్, ఎనర్జీతో పాటకు మరింత కలర్ యాడ్ చశారు. ముగ్గురి కాంబినేషన్ ఈ పాటను ఓ విజువల్ ట్రీట్‌గా మార్చింది. మాస్ కథల్లో స్పెషల్ సాంగ్స్ ప్రాధాన్యతను బాగా అర్థం చేసుకున్న దర్శకుడు బుచ్చిబాబు సానా, ఈ పాటను కూడా భారీ స్థాయిలో మలిచారు. ప్రతి ఫ్రేమ్‌లో కనిపించే నిర్మాణ విలువలు, సెట్స్, కాస్ట్యూమ్స్, కలర్ ప్యాలెట్ సినిమాకి ఉన్న గ్రాండియర్‌ను ప్రజెంట్ చేస్తున్నాయి. 'హల్లల్లల్లో' ఈ ఏడాది అత్యంత మాస్, క్రేజీ పాటల్లో ఒకటిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. జూన్ 4న విడుదలకు సిద్ధమవుతున్న 'పెద్ది' పై ఈ పాట మరింత హైప్‌ను పెంచింది. థియేటర్లలో ఈ పాట వచ్చేసరికి విజిల్స్, క్లాప్స్, సెలబ్రేషన్స్‌తో ప్రేక్షకులు ఊగిపోవడం ఖాయమనేలా 'హల్లల్లల్లో' అలరిస్తోంది.

తారాగణం: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ



# తొలి చిత్రం, తొలి అవకాశం.. ఇదే అని చెప్పుకుంటా!

హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్‌పై నిర్మించిన చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమాతో వి. మునిరాజు దర్శకుడిగా పరిచయమైన విషయం తెలిసిందే. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రం థియేటర్లలో మంచి సక్సెస్‌నే అందుకుంది. ఈ సినిమా మే 15 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో నటించిన నటుడు ప్రదీప్ కొట్టె.. సినిమా సక్సెస్‌పై ఆనందం వ్యక్తం చేస్తూ.. అనేక విషయాలను షేర్ చేసుకున్నారు. "మాది చిత్తూరు జిల్లా పలమనేరు. చెన్నైలో జాబ్ చేస్తూ.. హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యాను. ఇక్కడకు వచ్చాక షార్ట్ ఫిల్మ్స్ అంటూ యాక్టింగ్ వైపు వచ్చాను. బీ స్టూడియోలో బషీర్ మాస్టర్ నేతృత్వంలో కొన్ని నాటకాలలో యాక్ట్ చేశాను. ఆ నాటకాల్ని మా డైరెక్టర్ వి. మునిరాజు చూసి, 'తిమ్మరాజుపల్లి టీవీ'లోని 'రాజప్ప' పాత్ర కోసం ఆడిషన్ చేశారు. ఈ సినిమాకు కిరణ్ అబ్బవరం నిర్మాత అని తెలియగానే, సినిమాపై చాలా కాన్ఫిడెంట్ వచ్చింది. నేను చేసిన రాజప్ప పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయి. నా తొలి చిత్రం, తొలి అవకాశం అంటే ఇదే అని చెప్పుకుంటాను. షార్ట్ ఫిల్మ్స్, ఇండిపెండెంట్ సినిమాలు చేశాను కానీ.. తొలి ఫీచర్ ఫిల్మ్, మొదటి సారిగా స్క్రీన్ మీద కనిపించింది మాత్రం ఈ చిత్రంలోనే. నేను నా జాబ్ చేస్తూనే సినిమా అవకాశాల కోసం ప్రయత్నించాను. వర్క్ ఫ్రమ్ హోం, లీవ్స్ అంటూ.. ఈ మూవీని కూడా మ్యానేజ్ చేశాను. నేను పూర్తి స్థాయిలో ప్రయత్నించలేకపోవడంతోనే ఇంత ఆలస్యమై ఉంటుందని భావిస్తున్నాను. గత పదేళ్ల నుంచి రెండింటిని బ్యాలెన్స్ చేస్తూనే ఉన్నాను. నాకు చిన్నప్పటి నుంచీ సినిమాలంటే ఇష్టం. నాకు అదొక ప్యాషన్ అని తెలీదు.

# లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం' తో ముందుకు వస్తున్నారు

దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, పలు భాషల్లో దాదాపు అరవై చిత్రాలతో ఇండియన్ సినిమాని రీడిఫైన్ చేసిన సంగీతం, 94 ఏళ్ల వయసులో డైరెక్టర్ చైర్ లోకి తిరిగి వస్తూ, సృజనాత్మకతకు హద్దులు లేవని మరోసారి నిరూపిస్తున్నారు. ఐకానిక్ మూకీ చిత్రం 'పుష్పక్' నుంచి విజనరీ సైన్స్ ఫిక్షన్ క్లాసిక్ 'ఆదిత్య 369' వరకు ఆయన క్రియేటివిటీకి పర్యాయపదంగా నిలిచారు. కమల్ హాసన్‌తో ఆయన చేసిన 'విచిత్ర సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' బెంచ్ మార్క్ సినిమాలుగా నిలిచాయి. ఇప్పుడు, భారతదేశపు మొట్టమొదటి మ్యూజికల్ ఫాంటసీగా రూపొందించబడిన 'సింగ్ గీతం'తో అలరించబోతున్నారు.

వైజయంతి మూవీస్, స్వప్న సినిమా వంటి ప్రతిష్టాత్మక బ్యానర్ల పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్, ఒక దిగ్గజ దార్శనికుడిని, లెజెండరీ నిర్మాణ సంస్థను ఒకచోట చేర్చింది. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండేపూడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్, 'హలో బాసు' టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'సింగ్ గీతం' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ రోజు మేకర్స్ మీట్ అవర్ వైజాగ్ హీరో ఈవెంట్ నిర్వహించారు.

మీట్ అవర్ వైజాగ్ హీరో ఈవెంట్ లో హీరో అయాన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నా పేరు అయాన్. మాది వైజాగ్. అక్కయ్యపాలెంలో పెరిగాను. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి తెలుగు సినిమాలో హీరోగా నటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. ఇది నా తొలి చిత్రం. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా, లెజెండరీ సింగీతం శ్రీనివాసరావు గారి దర్శకత్వంలో పనిచేసే అవకాశం రావడం నిజంగా అదృష్టం. అన్ని వయసుల ప్రేక్షకులు ఎంజాయ్ చేసే అద్భుతమైన సినిమా ఇది. ఇలాంటి కాన్సెప్ట్‌తో ఇప్పటివరకు భారతీయ సినీ పరిశ్రమలో ఎవరూ సినిమా చేయలేదు. అలాంటి ప్రత్యేకమైన చిత్రానికి నేను హీరో అవుతానని ఎప్పుడూ ఊహించలేదు. ఇది నాకు నిజంగా ఒక డ్రీమ్ కమ్ ట్రూ మూమెంట్. అహల్యా బమ్రూ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాలో నేను 'గౌరీ' పాత్రను పోషిస్తున్నాను. మాది పుదుచ్చేరి . వైజాగ్ చూస్తుంటే నాకు పాండిచ్చేరి గుర్తొస్తుంది. నాకు వైజాగ్ అంటే చాలా ఇష్టం. ఈ సినిమా కోసం తెలుగు కూడా నేర్చుకున్నాను. 'సింగ్ గీతం'లో నటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. వైజయంతి మూవీస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో పని చేయడం ప్రతి నటుడి కల. ఈ సినిమాతో నా ఆ కల నెరవేరింది. జూన్ 11న విడుదల కానున్న ఈ చిత్రాన్ని అందరూ థియేటర్లలో



చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను. శాలిని కొండేపూడి మాట్లాడుతూ.. వైజాగ్ నాకు చాలా స్పెషల్. ఐ లవ్ వైజాగ్. ఈ సినిమాలో నేను 'రేణు' పాత్రలో కనిపించబోతున్నాను. ఇది చాలా కొత్తగా, ప్రత్యేకంగా ఉండే పాత్ర. ఇలాంటి విలన్ పాత్రను మీరు ఇప్పటివరకు ఏ సినిమాలోనూ చూసి ఉండరు. మా ఇంట్లో వాళ్లు నన్ను చూసి 'నీలాంబరి తర్వాత నువ్వే' అని సరదాగా అంటుంటారు (నవ్వుతూ). సింగీతం శ్రీనివాసరావు గారి సినిమాలో నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. జూన్ 11న సినిమా విడుదల కానుంది. తప్పకుండా అందరూ థియేటర్లలో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను.

మీట్ అవర్ వైజాగ్ హీరో ఈవెంట్ లో హీరో అయాన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నా పేరు అయాన్. మాది వైజాగ్. అక్కయ్యపాలెంలో పెరిగాను. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి తెలుగు సినిమాలో హీరోగా నటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. ఇది నా తొలి చిత్రం. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా, లెజెండరీ సింగీతం శ్రీనివాసరావు గారి దర్శకత్వంలో పనిచేసే అవకాశం రావడం నిజంగా అదృష్టం. అన్ని వయసుల ప్రేక్షకులు ఎంజాయ్ చేసే అద్భుతమైన సినిమా ఇది. ఇలాంటి కాన్సెప్ట్‌తో ఇప్పటివరకు భారతీయ సినీ పరిశ్రమలో ఎవరూ సినిమా చేయలేదు. అలాంటి ప్రత్యేకమైన చిత్రానికి నేను హీరో అవుతానని ఎప్పుడూ ఊహించలేదు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085